"డాక్టర్‌ని పిలుచుకు రండి...ప్రాణం పోయినట్లుంది....."

"ఖచ్చితంగా పోయినట్లేనా?" ఇంకెవరిదో గొంతు.

భయంకరమైన ఆర్తనాదం.... కొద్ది క్షణాల తర్వాత ఈ సంభాషణ. దీని అర్థం ఎవరో స్త్రీ హత్య చేయబడింది.

ఎవరయి వుంటారది?

మరికొన్ని గొంతులు వినిపించసాగినయ్ ఇప్పుడు. వాటినన్నిటిని ఓవర్‌లాప్ చేస్తూ మాధురి గొంతు, ఆమె ఏదో మాట్లాడుతోంది. స్పష్టంగా తెలియటం లేదు.

"ముందు మనం సురేష్‌తో మాట్లాడాలి" అంటూ సహదేవ్ అనటం వినిపించింది.

సురేష్ ఒక్క దూకుతో మంచం చేరుకుని నిద్రపోతున్నట్లు కళ్ళు మూసుకున్నాడు. మరుక్షణమే తలుపు తెరుచుకుంది. మెత్తని అడుగుల చప్పుడు.

"సురేష్!"

అతను కళ్ళు తెరిచాడు. ఆమెను చూసి చటుక్కున లేచి కూర్చున్నాడు.

మాధురి సోఫాలో కూర్చుంది.

"ఒక ప్రమాదం జరిగింది సురేష్! కల్పన టెర్రస్ మీదనుంచి కిందపడి చనిపోయింది."

సురేష్ గుండె వేగంగా కొట్టుకోసాగింది.

కల్పన ప్రమాదవశాత్తూ పడిపోయిందా? ఇంపాజిబుల్! ఆమెను చంపేశారు. హత్య! దారుణమయిన హత్య! కొద్ది గంటల క్రితమే కల్పన తనకు ఫోన్ చేసి చెప్పిన మాటలు చెవుల్లో భయంకరంగా మోగసాగినాయి.

"సురేష్! అది నన్ను కూడా చంపేయాలని చూస్తోంది. నువ్వు ఇవాళే పని పూర్తిచేయాలి. లేకపోతే నిన్నూ కూడా చంపేస్తుంది".

ఆమె చెప్పింది నిజమయిందిప్పుడు.

"ఎలా పడిపోయింది?" అడిగాడు గొంతు పెగల్చుకుని.

"ఆమెకి ఫిట్స్ వస్తూంటాయి. ఎప్పట్నుంచో వుందా జబ్బు. నిద్ర పట్టక టెర్రెస్ మీద కెళ్ళినట్లుంది! పిట్ట గోడ చాలా చిన్నది కదా! దానిమీద కూర్చున్నప్పుడు ఫిట్స్ వచ్చి వుంటాయి. అంతే! వెనక్కు పడిపోయింది. అంత ఎత్తునుంచీ పడితే ఎవరు మాత్రం బ్రతుకుతారు?"

"అవునవును...."

"పాపం అర్జున్ చాలా అప్‌సెట్ అయిపోయాడు. ఎంతయినా మామయ్య కూతురు కదా! పైగా తనామెను పెళ్ళి చేసుకోలేకపోయినందుకు ఫీలవుతున్నాడసలే"

సురేష్ కళ్ళప్పగించి చూస్తున్నాడామెవైపు.

ఎవరు నిజం మాట్లాడుతున్నారో, ఎవరు అబద్ధం చెబుతున్నారో ఏమీ అర్థం కావటం లేదు. అర్జున్‌ని ఆ గదిలో గొలుసులతో బంధించి వుంచటం తన కళ్ళతో తను చూశాడు. అతను కల్పన విషయం విని అప్సెట్ అయ్యాడని మాధురి చెప్తోంది.

సహదేవ్ వడివడిగా లోపలకొచ్చాడు. అతని వెనకే విష్ణు.

"సురేష్ ! డాక్టర్ వస్తున్నాడు. అతనితోపాటు బహుశా పోలీస్ ఇన్స్‌పెక్టర్ కూడా రావచ్చు. వాళ్ళతో ఇప్పుడు మాట్లాడటానికి అర్జున్ ఇష్టపడటం లేదు. కనుక నీ దగ్గరకు తీసుకువస్తాను. వాళ్ళు నిన్నేమయినా అడిగితే నువ్వు చాలా విచారంగా వున్నట్లు నటించు. ఇవాళేమీ చెప్పలేననీ మరోసారి మాట్లాడతానని వాళ్ళను పంపించెయ్, సరేనా?" తాపీగా అడిగాడతను.

సురేష్ సరేనన్నట్లు తలూపాడు.

"జాగ్రత్త! ఏ మాత్రం పొరపాటు జరిగినా ప్రాణం మీద కొస్తుంది."

సురేష్ గుండె ఝల్లుమంది.

ఏమిటా మాటకర్థం? పొరపాటు జరిగితే ఎవరి ప్రాణం మీదకొస్తుంది? తన ప్రాణం మీదకేనా?

"నాతోపాటు నిన్ను కూడా చంపేస్తారు" కల్పన మాటలు మళ్ళీ మార్మోగాయి.

మాధురి, సహదేవ్ వెళ్ళిపోయారు. సురేష్ వేగంగా ఆలోచించసాగాడు. ఇది తనకు అద్భుతమయిన అవకాశం. ఇన్స్‌పెక్టర్ వచ్చినప్పుడు తను యిక్కడ జరుగుతున్నవన్నీ చెప్పెయాలి. తనను మోసం చేసి ప్లాస్టిక్‌సర్జరీ చేసిన విషయం, తనతో చేయిస్తోన్న అఘాయిత్యాలు, తనమీద జరుగుతున్న హత్యా ప్రయత్నాలు.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ ఎదురుగ్గా వున్నందు వల్ల తననెవరూ ఏమీ చేయలేరు. తను ఈ సాలెగూడు నుంచి తప్పించుకు బయటపడాలంటే ఇదే సమయం.

విష్ణు వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

"పోలీస్ ఇన్స్‌పెక్టర్ దగ్గర జాగ్రత్తగా మసలుకోవాలి సురేష్! లేకపోతే నీకు హఠాత్తుగా హార్టెటాక్ రావచ్చు, లేదా ఇంకేదయినా జరగవచ్చు. అన్నిటికీ ఏర్పాట్లున్నాయి మనదగ్గర. ఇన్స్‌పెక్టర్‌తో నువ్వు ఒక్క అక్షరం పొరపాటు పలికినా చాలు-అదే ఆఖరి పొరపాటవుతుంది. ఆ విషయం నువ్వు తెలుసుకునే టైమ్ కూడా వుండదు."

సురేష్ నిశ్చేష్టుడైపోయాడు.

తన ఆలోచనలన్నీ చదివేసినట్లు మాట్లాడుతున్నాడు.

"ఇంక పద వెళ్దాం" అన్నాడు విష్ణు.

అతని వెనకే లిఫ్టు దగ్గరకు నడిచాడు సురేష్.

గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఆగింది లిఫ్టు. డ్రాయింగ్ రూమ్‌లోకి నడిచారు ఇద్దరూ. చాలా

పెద్ద గది. నాలుగు సోఫాలు వున్నాయి గది మధ్యలో.

బాల్కనీలో నుంచి బయట గార్డెన్ కనబడుతోంది దేదీప్యమానంగా వెలుగుతున్న లైట్లు. ఆ లైట్ల కాంతిలో పచ్చటి, మెత్తటి పచ్చిక మీద కల్పన శరీరం తల పచ్చడయి, ఎర్రని ముద్దలా! సోఫాలో కూర్చున్నాడు సురేష్. మొహానికి రెండు చేతులూ అడ్డం పెట్టుకుని దిగులుగా, ఏడుపులో మునిగిపోయి వున్నట్లు.

మాధురి బయట సోఫాలో కూర్చుంది. ఆమె పక్కనే సహదేవ్.

గేటు దగ్గర నలుగురు సెక్యూరిటీ గార్డులు చాలా ఎలర్ట్‌గా నిలబడి వున్నారు.

హఠాత్తుగా కారు హారన్ వినిపించింది. తెల్లని కాంటెసా కారు గేట్ దగ్గరకొస్తూనే గేటు తెరిచి పట్టుకున్నారు వాళ్ళు.

మాధురి సహదేవ్ మాట్లాడాక కల్పన దేహాన్ని పరీక్షించాడతను.

"చనిపోయింది. పోలీసులు వచ్చే వరకూ మనమేమీ చేయకూడదు" అన్నాడతను.

అందరూ హాల్లోకొచ్చారు.

"అర్జున్ పూర్తిగా అప్‌సెట్ అయిపోయారు" అంది మాధురి.

ఆ వృద్ధుడు వచ్చి సురేష్ పక్కన కూర్చుని భుజం తట్టాడు.

"డోంట్ గెట్ అప్సెట్ మిస్టర్ అర్జున్! అలాంటి సంఘటనల్ని చాలా ధైర్యంగా ఎదుర్కోవాలి" మాధురి చప్పున కల్పించుకుంది.

"ఈ గొడవలన్నీ డాక్టరుగారు చూసుకుంటారు. మీరెళ్ళి గదిలో పడుకోమని నేను ఇందాకట్నుంచీ చెబుతున్నాను" అంది తనే మళ్ళీ.

"అవును మిస్టర్ అర్జున్! మీ అవసరం బహుశా ఏమీ వుండదు. ఒకవేళ అంతగా అవసరమైతే మిమ్మల్ని పిలుస్తాను. వెళ్ళండి" అన్నాడు డాక్టర్.

"పదండి" అన్నాడు సహదేవ్ సురేష్ దగ్గరకొచ్చి. సురేష్ లేచి లిఫ్టు దగ్గరకు నడచాడు. వెనుకే విష్ణు, సహదేవ్.

ఆరో అంతస్తు చేరుకున్నాక తన గది వైపు నడవబోతుంటే విష్ణు అడ్డుపడ్డాడు.

"ఈ రాత్రికి అర్జున్ గదిలో గడపాలి సురేష్! ఈ తతంగమంతా ముగిసే వరకూ నువ్వు అర్జున్‌వి."

మాధురి గదిలోకి నడిచి మంచం మీద వాలిపోయాడతను. కింద పోలీస్ జీప్ వచ్చి ఆగిన శబ్దం వినిపించింది. లేచి వెళ్ళి కిటికిలో నుంచి చూశాడు. పోలీస్ జీప్ వెనుకే అంబులెన్స్ ఆగివుంది. పది నిమిషాలు గడిచి పోయినాయి. దూరంగా బూట్ల చప్పుడు వినిపించసాగింది. మళ్ళీ మంచంమీద పడుకున్నాడతను. బహుశా పోలీస్ ఇన్స్‌పెక్టర్ వస్తూండుంటాడు.

తలుపు మీద తట్టిన శబ్దం.

సురేష్ కళ్ళు మూసుకున్నాడు. ఏవో మాటలు వినిపించాయి. వెంటనే తలుపు తెరుచుకుని లోపలికొచ్చారు.

అతను కళ్ళు తెరవలేదు.

మాధురి, డాక్టర్, పోలీస్ ఇన్స్పెక్టర్, సహదేవ్, విష్ణు అందరూ నిలబడి వున్నారు.

"వారిని డిస్టర్బ్ చేయడం అనవసరం అనుకుంటాను ఇన్స్పెక్టర్‌గారూ! ఈ షాక్ నుంచి తేరుకోటానికని నేనే స్లీపింగ్ పిల్స్ యిచ్చాను" డాక్టర్ గొంతు.

సురేష్ గుండె వేగంగా కొట్టుకోసాగింది! అదే అవకాశం తనకు తప్పించుకుని బయటపడగల అవకాశం. ఇప్పుడు తను మంచం మీదనుంచి ఒక్క దూకు దూకి ఇన్స్పెక్టర్ దగ్గరకెళ్ళి తనను రక్షించమని అరవాలి.

"దట్సాల్ రైట్! తర్వాతెప్పుడయినా...." ఇన్స్పెక్టర్ గొంతు.

"ఇటిజ్ క్లియర్ కేస్...." డాక్టర్ గొంతు "నేనే ఆమెకి ట్రీట్‌మెంట్ ఇస్తూండేవాడిని ఫిట్స్‌కి.... చాలాకాలం నుంచీ. ఎన్నోసార్లు ఎన్నో ప్రమాదాల నుంచి తప్పించుకుంది ఆకస్మిక మూర్ఛల వల్ల. చివరకు ఈ రోజిలా ప్రాణాలు కోల్పోవాలని వుంది పాపం....."

"అఫ్‌కోర్స్ చాలా డేంజరస్ జబ్బు అది..."

సురేష్‌కర్థమైపోయింది. డాక్టర్‌ని కొనేశారు వాళ్ళు. అవసరమైతే ఇన్స్పెక్టర్ని కూడా కొనేస్తారు. అంత డబ్బు ముందు ఎవరు మాత్రం రొమ్ము విరిచి నిలబడగలరు? డబ్బు పవర్ ముందు మనిషి పవరెంత? విష్ణు తన మంచం దగ్గరకొచ్చి నిలబడటం కనబడుతోంది. అతని చేతిలో ఏదో సన్నని సూదిలాంటిది కనబడుతోంది. తనేమైనా పొరబాట్లు చేస్తే సరిదిద్దే ఏర్పాట్లలో బహుశా అది ఒకటి అయ్యుంటుంది.

మరో అరగంటలో కారు, జీప్, అంబులెన్స్ వెళ్ళిపోవటం తెలుస్తూనే వుంది. విష్ణు గదిలోకి వచ్చాడు మళ్ళీ. "చాలా బాగా నటించావు సురేష్! ఇంక నీ గదిలోకెళుదువుగాని పద!".

లేచి అతని వెనుకే తన గదిలోకి చేరుకున్నాడు సురేష్. తలుపు బోల్ట్ వేసుకుని మంచం మీద పడుకున్నాడు.

అప్పుడు పూర్తిగా అర్థమవుతోందంతా!

అర్జున్ మీద హత్యా ప్రయత్నం జరుగుతోందని, తనను అర్జున్ స్థానంలో బలిపశువులాగా ప్రవేశపెట్టారు. ఇప్పుడు తనను వుపయోగించుకుని అర్జున్‌నే తొలగించాలని ప్రయత్నిస్తున్నారు. అందుకే అతనిని ఆ గదిలో గొలుసులతో బంధించారు. పోలీస్ ఇన్స్పెక్టర్ వచ్చినప్పుడు అర్జున్‌ని చూపటం సాధ్యంకాదు గనుక తనను ప్రవేశపెట్టారు.

దీని తర్వాతేం జరగబోతోంది? అర్జున్‌ని చంపేస్తారా?

రాత్రంతా కంటి మీద కునుకు లేదు. తెల్లారుజామున కళ్ళు మూతలు పడుతుండగా పెదాల మీద మెత్తగా ఏదో తగిలినట్లయ్యి వులిక్కిపడి కళ్ళు తెరిచాడు. ఎప్పుడు వచ్చిందో తన పక్కనే వుంది....తన పెదాల మీద ముద్దు పెట్టుకుంటూ.